గండేపల్లి మండలం జడ్.రాగంపేటలో 3,884 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత

వివరాలు 7లో....



రాచరిక పోకడలకు స్వస్తి

- సబ్ రిజిస్ట్రార్లు కూడా సామాన్యులేననే భావన కలిగేలా చర్యలు
- కోర్టుల్లో జడ్జిల తరహాలో కూర్చునే విధానానికి చెల్లుచీటీ
- అన్ని ప్రభుత్వ ఆఫీసుల్లో ఉన్నట్టుగానే సబ్ రిజిస్ట్రార్ల సీటింగ్
- ఉత్తర్వులు జారీ చేసిన ఆర్‌పీ సిసోడియా

బ్రిటిష్ కాలంనాటి సంప్రదాయానికి స్వస్తి పలుకుతూ ప్రజలకు స్నేహ పూర్వక సేవలు అందించాలని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం భావించింది. గతంలో సబ్ రిజిస్ట్రార్ సీటు ఎత్తుగా దిమ్మ కట్టి దాని చుట్టూ ఎరుపు రంగు క్లాత్ కప్పి ప్రత్యేకంగా ఉండేది. అయితే ప్రజలకు అందుబాటులో ఉండేలా ఫ్లోరింగ్‌కు సమాన ఎత్తులోనే టేబుల్ వేసుకుని ఎదురుగా కుర్చీలు ఏర్పాటుచేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా ఆదేశాలు జారీ చేశారు.

పెద్దాపురం, సెప్టెంబరు 15: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రాచరికపు పోకడలకు కూటమి ప్రభుత్వం స్వస్తి పలకనుంది. కోర్టుల్లో జడ్జీల తరహాలో రిజిస్ట్రార్లు కూర్చునే విధానానికి చెల్లుచీటీ పలికేలా రిజిస్ట్రేషన్ల శాఖ కసరత్తు చేసింది. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మాదిరిగానే సబ్ రిజిస్ట్రార్ల సీటింగ్ ఉండేలా చర్యలు ప్రారంభించింది. ఇప్పటివరకూ సబ్ రిజిస్ట్రార్లు కుర్చునే సీటు చుట్టూ ఎరుపు రంగుతో బారికేడ్, లోపలికి బయట వ్యక్తులు ఎవరూ ప్రవేశించకుండా చిన్న తలుపు ఏర్పాటుచేసుకున్నారు. ఇది రాచరికపు వ్యవస్థను తలపించేలా ఉండడంతో కార్యాలయానికి వచ్చిన ప్రజలు అక్కడి వాతావరణాన్ని చూసి ఒకింత భయానికి లోనయ్యేవారు. ఆస్తులు క్రయ, విక్రయాలకు ఏస్థాయి అధికారి, ప్రజాప్రతినిధి వచ్చినా సబ్ రిజిస్ట్రార్ల ముందు నిలుచోవాల్సి వచ్చేది. సబ్ రిజిస్ట్రార్లు కూడా సామాన్యులే అనే భావన కలిగేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆస్తుల క్రయ, విక్రయాలకు వచ్చేవారు ప్రభుత్వానికి ఫీజు చెల్లిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దారు కార్యాలయాల మాదిరిగానే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కూడా స్నేహపూర్వక వాతావరణం ఉండేలా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా వున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల రూపురేఖలను మార్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రజలకు మెరుగైన సేవలందించే విధంగా ఆలోచన చేసింది.



అడవిని వదిలి.. జనారణ్యంలోకి..

చిరుత ఎందుకొచ్చింది.. ఎలా వచ్చింది..

అమ్మో పులి.. రాజమహేంద్రవరంలో ఉందట.. ఎవరి నోటా విన్నా ఇదే మాట.. ఎక్కడ నుంచి వచ్చిందో.. ఎలా వచ్చిందో... ఎందుకు వచ్చిందో అంటూ రకరకాల ప్రశ్నలు.. ఒక్కప్రశ్నకూ అంతుచిక్కదు.. మరో వైపు అటు వైపు వెళితే ఏం జరుగుతుందోననే భయం.. గత 10 రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదీ పరిస్థితి. అసలు పులి ఎక్కడ నుంచి.. ఎలా వచ్చి ఉంటుంది... ఇక్కడికే ఎందుకు వచ్చింది.. అసలేం చేస్తుందనే దానిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

అడవి నుంచి దారి తప్పి జనారణ్యంలోకి చిరుత పులి ఎలా రాగలిగింది? చిరుత పులులకు ఆవాసంగా ఉన్న పాపికొండలు అభయారణ్యం నుంచి గోదావరి నది మీదుగా వచ్చిందా...లేదా అదే అభయారణ్యం విస్తరించి ఉన్న రంపచోడవరం,మారేడుమిల్లి మీదుగా వచ్చిందా? అటవీ శాఖ రకరకాల విశ్లేషణలు చేస్తోంది. రోజుకు వంద కిలో మీటర్లకుపైగా నడిచే చిరుత పులి ఎన్ని రోజుల పాటు నడుచుకుని ఇక్కడకు వచ్చింది? అనే దానిపై అటవీ శాఖలో చర్చ సాగుతోంది. భారీ వర్షాలు, వరద లకు అడవుల్లో చిరుతపులి స్థావరం దెబ్బతింటే అక్కడి నుంచి సురక్షిత స్థావరం వెదికే క్రమంలో దారితప్పి ఉంటుం దని అనుమానిస్తున్నారు. చిరుత పులి స్థావరంలోకి పెద్ద పులి వస్తే తక్షణం ఉండే ప్రాంతాన్ని మార్చడం చిరుత లక్షణం కావడంతో ఆ క్రమంలో దారితప్పి ఉంటుందని భావిస్తున్నారు.ఈ క్రమంలో గోదావరిని ఈదుకుంటూ రావడం లేదా రంప అడవుల నుంచి గోకవరం మీదుగా రాజమహేంద్రవరంలోకి వచ్చేసి ఉంటుందని విశ్లేషిస్తున్నారు. ఇంకో పులితో జత కట్టిన తర్వాత ఆడ, మగ పులి విడిపోతాయి.ఇలా మళ్లీ జత కోసం ప్రయత్నిం చే సమయంలో దారితప్పి నగరంలోకి వచ్చి ఉంటుందని చెబుతున్నారు.గతంలో ఉమ్మడి జిల్లాలకు దారితప్పి వచ్చిన చిరుతల ఘటనలతో పోల్చి విశ్లేషణలు చేస్తున్నారు.

10 రోజులైనా చిక్కని చిరుత..

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం శివారులోని 900 ఎకరాల రిజర్వు ఫారెస్టులో పది రోజుల నుంచీ చిరుత హుందాగా సంచరిస్తూ అటవీ అధికారులకు మాత్రం చిక్కడం లేదు. పట్టుకొని తీరుతామని అటవీ అధికారులు.. పట్టుకోండి చూద్దామంటూ చిరుతపులి ప్రతిరోజూ సవాళ్లు విసురు కుంటూనే ఉన్నారు. అటవీ అధికారులు అమర్చిన 50 ట్రాప్ కెమెరాల్లోని ఎక్కడో అక్కడ చిరుత ఫొటోకు ఫోజు ఇచ్చి వెళ్లిపోతోంది. ఆ కెమెరాలను అటవీ సిబ్బంది తనిఖీ చేసే సమయానికి పుణ్యకాలం గడిచిపోతోంది. 50 మంది సిబ్బందితో కూడిన బృందాలు ఏ ప్రయత్నాలు చేస్తున్నా నాలుగు బోన్‌లలో ఒక్క దాంట్లోకీ చిరుత దూరడం లేదు. థర్మల్ డ్రోన్‌ని వినియోగించినా ఫలితం కానరావడం లేదు. లాలాచెరువు హౌసింగ్ బోర్డు, ఆటోనగర్, దివాన్ చెరువు, శ్రీరాంపురం తదితర ప్రాంతాల ప్రజలు మాత్రం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం ప్రణాళికలు..విశ్లేషణలు.. ప్రకటనల మాట ఎలా ఉన్నా భయభ్రాంతులకు గురవుతున్నారు.

ఎలా వచ్చిందంటే...



పాపికొండలు అభయారణ్యం నుంచే చిరుతపులి దారితప్పి వచ్చిందని చెబుతున్నారు. ఎందుకంటే పులులు, చిరుత పులులకు పాపికొండలు అభయారణ్యం పెట్టింది పేరు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు, అల్లూరి సీతారామరాజు జిల్లా వీటి పరిధిలోని ఏజెన్సీ కలిపి మొత్తం 1.02 లక్షల హెక్టార్లు అంటే 2.60 లక్షల ఎకరాలు.ఈ కొండల మధ్యలో గోదావరి ఉంది. ఈ అభయారణ్యం పులులకు ఆవాసం. మూడేళ్లకోసారి కెమెరా ట్రాప్ ద్వారా పులుల లెక్కింపును అధికారులు చేపడతారు. ఇటీవల ఈ అభయారణ్యంలో అధికారులు రెండు దశల్లో 232 ట్రాప్ కెమెరాలతో 116 ప్రాంతాల్లో సర్వే చేయగా నాలుగు పెద్దపులులు,ఆరు చిరుత పులులు ఉన్నట్టు గుర్తించారు. ట్రాప్ కెమెరాకు చిక్కని చిరుత పులులు మాత్రం ఇంకో 12 వరకు ఉండొచ్చని అంచనా. రంపచోడవరం, మారేడుమిల్లి అడవుల్లోనూ చిరుతల సంచారమే అధికమని అక్కడ పనిచేసిన అటవీ అధికారులు చెప్తున్నారు. రాజమహేంద్రవరంలోకి దారితప్పి వచ్చిన చిరుత పాపికొండలు అభయారణ్యం నుంచే వచ్చిందని చెబున్నారు. ఇటీవల గోదా వరికి వరద పోటెత్తడంతో అడవుల్లో చిరుత స్థావరం చెల్లాచెదురై కొత్త స్థావరం కోసం వెదికే క్రమంలో గోదావరి ఈదుకుంటూ రాజమహేంద్రరంలోకి వచ్చి ఉండొచ్చని అంచనా. పాపికొండలు అభయారణ్యం విస్తరించిన ఏజెన్సీ ప్రాంతంలోను వీఆర్‌పురం, రంపచోడవరం, మారేడుమిల్లి, గోకవరం మీదుగా చిరుత రాజమహేంద్రవరంలోకి దారి తప్పి వచ్చి ఉండొచ్చని చెప్తున్నారు.ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి పోలవరం ప్రాజెక్టు మీదుగా రంప ఏజెన్సీ వరకు విస్తరించి ఉన్న పాపికొండలు అభయారణ్యంలో ఎటువైపైనా పులులు దారి తప్పవచ్చని విశ్లేషిస్తున్నారు.

అందుకే కదలడం లేదా...

ఈ ఏడాది ఫిబ్రవరిలో ఏలూరు జిల్లా పరిధిలోకి ఓ మగ పులి పాపికొండలు అభయారణ్యంలోకి వచ్చింది. వంద కిలోమీటర్లకుపైగా నడిచి తిరిగి అభయారణ్యంలోకి వెళ్లిపోయింది. పాపికొండలు అభయారణ్యాన్ని ఆనుకుని కొండలు, గోదావరి నది ద్వారా పులి సంచరించి ఇలా వచ్చిందని అప్పట్లో భావించారు. 2022 మేలో ఓ పులి ఏజెన్సీ మీదుగా ప్రత్తిపాడు, శంఖవరం, తుని రూరల్ మీదుగా వెళ్లింది. ప్రత్తిపాడులో బోనులోకి చిక్కినట్లే చిక్కి తప్పించుకుంది.ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, ఏజెన్సీ ప్రాంతాల మీదుగా విస్తరించి ఉన్న అడవుల నుంచి కొన్నిసార్లు దారితప్పడం వలనే ఈ ఘటనలు చోటుచేసుకుంటున్నట్టు చెప్తున్నారు. ఇప్పుడు రాజమహేంద్రవరంలోకి చిరుతపులి రావడం క్రమేపీ నగరాల్లోకి దారితప్పి వస్తున్న పులుల సంచారం చర్చనీయాంశంగామారింది.రాజమహేంద్రవరంలో సంచరిస్తున్న చిరుత రిజర్వు ఫారెస్టులో ఉంది. అనువైన వాతావరణం ఉండడంతో అక్కడి నుంచి కదలట్లేదని సమాచారం.

చిరుత కంటే తక్కువ ఎత్తు ఉంటేనే దాడి..

పులి, చిరుత పులికి చాలా వ్యత్యాసాలున్నాయి. పులి జాడ ఉన్న చోట చిరుతపులి పెద్దగా ఉండదు. కానీ చిరుతపులితో పోల్చితే పులి చాలా తెలివైనది. ఇది పెద్దగా జనావాసాల్లోకి రాదు. ఒకేచోట ఎక్కువగా ఉంటుంది.చిరుత అలా కాదు. ఇది నిరంతరం తిరుగుతూనే ఉంటుంది. వంద కిలోమీటర్లు అవలీలగా నడిచేస్తుంది. పులి కేవలం ఆకలి వేస్తేనే వేటాడుతుంది. చిరుతపులి అలా కాదు.చిరుత లక్షణం నిరంతరం ఏదొకటి వేటాడుతూ తింటూ ఉండడమే. ఇది తక్కువ ఎత్తయిన జంతువులు పంది,కుక్కలను వేటాడి తింటుంది. ఎత్తయిన జంతువులను చిరుత వేటాడలేదు. మనుషులు ఎత్తుగా ఉండడం వల్ల మనుషులను చూస్తే చిరుత కొంత భయపడుతుంది.అదే కూర్చుని ఉంటే తక్కువ ఎత్తు వల్ల సులువుగావేటాడుతుందనిఅటవీ అధికారులు విశ్లేషించారు.

- రాజమహేంద్రవరంలోనే చిరుత
- ఇంకా కొనసాగుతున్న అన్వేషణ
- పాపికొండలు అభయారణ్యం నుంచే రాక?
- ఇక్కడకు రావడానికి కారణాలపై విశ్లేషణలు
- ఎలా వచ్చిందనే దానిపై ఇంకా అస్పష్టత
- పులి కంటే చిరుతపులే ప్రమాదకరం
- ఆకలి వేసినప్పుడే పులి వేట..
- చిరుతది నిరంతర వేట

పిల్లలను బయటకు రానీయవద్దు : డీఎఫ్‌వో

దివాన్‌చెరువు, సెప్టెంబరు 15: దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలో అమర్చిన ట్రాప్ కెమెరాలో ఆదివారం తెల్లవారుజామున చిరుతపులి కదలిక చిత్రాలు కనిపించాయని ఇన్‌చార్జి డీఎఫ్‌వో ఎస్.భరణి తెలిపారు. ప్రస్తుతం చిరుతపులి దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలోనే ఉందని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హౌసింగ్‌బోర్డుకాలనీ,ఆటోనగర్, దివాన్‌చెరువు అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న ఏరియాల్లో పిల్లలను తల్లిదండ్రులు సాయంత్రం 6 గంటల తర్వాత బయటకు తిరగకుండా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు.


స్థిరంగా ఏలేరు వరద

ఏలేరు వరద స్థిరంగా కొనసాగుతోంది. ఇన్‌ఫ్లోస్‌కు అనుగుణంగా రిజర్వాయర్ నుంచి వరద జలాల విడుదలను ఆదివారం కొనసాగించారు. పలు ప్రాంతాల్లో పొలాలు ముంపులోనే ఉన్నాయి.



పిఠాపురం-గొల్లప్రోలు మధ్య ఏలేరు కాలువలో వరద నీటి ప్రవాహం

గొల్లప్రోలు/పిఠాపురం, సెప్టెంబరు 15: ఏలేరు రిజర్వాయర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోస్ అధికంగానే ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో రిజర్వాయర్ నుంచి నీటి విడుదలను 5,875 క్యూసెక్కులుగా కొనసాగిస్తున్నారు. ఏలేరు కాలువలకు 5వేల క్యూసెక్కులు, డీసీఆర్ స్లూయిస్ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, విశాఖ తాగునీటి అవసరాల నిమిత్తం 275 క్యూసెక్కులు పంపిస్తున్నారు, ఏలేరు రిజర్వాయర్‌లో గరిష్ఠ నీటిమట్టం 86.56 మీటర్లు కాగా నీటి నిల్వ సామర్థ్యం 24.11 టీఎంసీలుగా ఉండగా సాయంత్రం 5గంటలకు నీటిమట్టం 85.70మీటర్లు ఉండగా నీటి నిల్వలు 22.38 టీఎంసీలుగా ఉన్నాయి. వరద నీటి విడుదలతో గొల్లప్రోలు, పిఠాపురం పట్టణాలతో పాటు మండలాల పరిధిలోని గ్రామాల్లో సుమారు 2,250 ఎకరాల్లో వరి పంట ఇంకా ముంపులో ఉంది. గండ్లు నుంచి నీటి ప్రవాహం వస్తుండడంతో మరలా పొలాల్లోకి నీరు చేరుతోంది. మరోవైపు గండ్లు పడిన ప్రాంతాల్లో ఇసుక మేటలు భారీగా వేసాయి. గొల్లప్రోలు, సీతానగరం, లక్ష్మీపురం, రాపర్తి, భోగాపురం, వీరరాఘవపురం తదితర ప్రాంతాల్లో సుమారు 100 ఎకరాల్లోని పంట పొలాల్లో ఇసుక మేటలు వేసినట్టు చెప్తున్నారు. పలుచోట్ల పంట పొలాల్లో మట్టి కొట్టుకుపోయింది. కాలువల చెంతనే ఉన్న పొలాల్లో ఈ పరిస్థితి నెలకొంది. బంగాళాఖాతంలో ఈనెల 23వ తేదీ నాటికి వాయుగుండం ఏర్పడుతుందన్న సమాచారంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అంతేగాక సోమవారం నుంచి మూడు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సమాచారం ఇచ్చింది. దీంతో మరలా వరినాట్లు లేదా ఇతర పంటలు సాగు చేయాలనే ఆలోచనలో ఉన్న రైతులు నెలాఖరు వరకు దెబ్బ తిన్న వరి, ఇతర పంటల పొలాలను అదే విధంగా వదిలివేయాలని భావిస్తున్నారు. ఈ ప్రభావాలు తగ్గిన తర్వాత మరలా సాగుపై ఆలోచన చేయాలని వారు భావిస్తున్నారు.



ఏలేరు జలాశయం నుంచి 5,600 క్యూసెక్కుల నీరు విడుదల

ఏలేశ్వరం, సెప్టెంబరు 15: ఏలేశ్వరంలోని ఏలేరు ప్రాజెక్టు నుంచి 5,600 క్యూసెక్కుల నీటిని రెండు గేట్ల ద్వారా విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. దీంతో దిగువ ప్రాంత ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరివాహక ప్రాంతం నుంచి 5,411 క్యూసెక్కుల చొప్పున వరద నీరు వచ్చి చేరడంతో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. దీంతో ప్రాజెక్టులో ఆదివారం నాటికి 86.56 మీటర్లకు గాను 85.71 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 22.38 టీఎంసీలు నీటి నిల్వలు వున్నాయి. ప్రస్తుతం విశాఖకు 275 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు.



పిఠాపురం మండలం వీరరాఘవపురం వద్ద గండి పడిన ప్రాంతంలో పొలాల్లో వేసిన ఇసుకమేట



వారికి ఊరట!

- జిల్లాలో 3,480 మంది సీబీఎస్ఈ విద్యార్థులు
- సామర్థ్య పరీక్షల్లో కనీసం 90శాతం రాని ఫలితాలు
- ఈ ఏడాది వారందరికీ రాష్ట్ర బోర్డు పరీక్షలు

కాకినాడ రూరల్, సెప్టెంబరు 15: గత వైసీపీ ప్రభుత్వం గత ఏడాది రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి పాఠశాలలను సీబీఎస్ఈలోకి మార్చింది. వాటిలో చదువుతున్న సుమారు 78వేల మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతిలోకి ప్రవేశించారు. 2020లో ఈ విద్యార్థులు 6వ తరగతిలో ఉన్నప్పుడు అప్పటి ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టింది. సీబీఎస్ఈ పరీక్షలు పూర్తిగా ఆంగ్ల మాధ్యమంలోనే ఉంటాయి. వారంతా సీబీఎస్ఈ బోర్డు పరీక్షలను ఈ ఏడాది మార్చిలో రాయాల్సి ఉండగా వారి అభ్యసనా సామర్థ్యాలపై పాఠశాల విద్యా శాఖ ఇటీవల అసెస్‌మెంట్ పరీక్ష నిర్వహించింది. అందులో 90శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించలేదు. వారు పబ్లిక్ పరీక్షలు కూడా సీబీఎస్ఈ తరహాలో రాస్తే ఎక్కువ మంది ఫెయిలయ్యే ప్రమాదం ఉందని గుర్తించిన కూటమి ప్రభుత్వం స్టేట్ బోర్డులోనే, రాష్ట్ర సిలబస్‌తోనే పరీక్షలు రాయించేలా చర్యలు చేపట్టాలని జీవో జారీ చేసింది. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ నిర్ణయంతో కాకినాడ జిల్లాలో మొత్తం 33 ప్రభుత్వ, సాంఘిక సంక్షేమ, మున్సిపల్ పాఠశాలల్లోని 3,480 మంది సీబీఎస్ఈ విద్యార్థులకు ఊరట లభించిందని ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఒక్క తెలుగు పుస్తకం తప్పితే మిగతా టెక్స్ట్ బుక్స్ అన్నింటిలోనూ రాష్ట్ర సిలబస్, సీబీఎస్ఈ సిలబస్ ఒకే విధంగా ఉంటుంది. దీనివల్ల విద్యార్థులు కూడా సులువుగా నేర్చుకుంటారు. ఇబ్బందిపడే సమస్య ఉండదు.

విద్యార్థులకు ఎంతో మేలు



పి.రమేష్, డీఈవో, కాకినాడ

ప్రభుత్వ నిర్ణయంతో సీబీఎస్ఈ విద్యార్థులకు ఎంతో మేలు కలగనుంది. ప్రభుత్వ నిర్ణయాన్ని జిల్లాలో అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. దీనిని అమలు చేయాలని జిల్లాలోని 21 మండలాల ఎంఈవోలకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాము.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 15: ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ మంగళవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కాకినాడ కలెక్టరేట్‌లో జరుగుతుందని కలెక్టర్ షాన్ మోహన్ తెలిపారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

ఉమ్మడి 'తూర్పు'లో 50 చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు

ఈ నెల 21 నుంచి ప్రక్రియ మొదలు

డిసెంబరు 6న కొలువుదీరనున్న పాలకవర్గాలు... 7లో



డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసం వద్ద వినాయక లడ్డూకు వేలం

రూ.1.06లక్షలకు దక్కించుకున్న డాక్టర్ బుర్రా దివ్యరాజ్



గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 15: గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసం వద్ద నిలిపిన వినాయక విగ్రహం వద్ద ప్రసాదంగా ఉంచిన లడ్డూకు ఆదివారం వేలం నిర్వహించారు. దీనిని దక్కించుకునేందుకు పలువురు పోటీపడ్డారు. డాక్టర్ బుర్రా దివ్యరాజ్ రూ.1.06 లక్షలకు దీనిని దక్కించుకున్నారు. అనంతరం మట్టి వినాయక విగ్రహాన్ని మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి చేబ్రోలు గ్రామ శివారులోని కృష్ణంరాజు చెరువులో నిమజ్జనం చేశారు.

బై బై గణేశా...



యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ బీచ్‌లో గణనాథులను నిమజ్జనం చేస్తున్న భక్తులు

చవితి పందిళ్లలో తొమ్మిది రోజులు పూజలు చేసిన గణనాథులకు భక్తులు అంతే భక్తి శ్రద్ధలతో వీడ్కోలు పలికారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిలిపిన గణనాథులను వాహనాలపై ఉంచి నిమజ్జనానికి తరలించారు. బాణసంచా, సాంస్కృతిక ప్రదర్శనల నడుమ ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్నారు. నిమజ్జనోత్సవంలో పాల్గొన్న యువకులు గణేష్ మహరాజ్ కీ జై అంటూ నినాదాలు చేస్తూ... పరస్పరం రంగులు చల్లుకుంటూ ముందుకు సాగారు. కాలువలు, ఉప్పాడ సముద్రంలో విగ్రహాలను నిమజ్జనం చేశారు..... వార్తలు 8లో

సంఘాలకు సహకారం

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 50 చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు
- ఈ నెల 21 నుంచి ప్రక్రియ మొదలు
- డిసెంబర్ 6న కొలువుదీరనున్న కొత్త పాలక వర్గాలు
- ఐదేళ్లుగా ఎన్నికలు నిర్వహించకుండా నిర్వీర్యం చేసిన వైసీపీ ప్రభుత్వం
- ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు

కార్పొరేషన్(కాకినాడ), అమలాపురం రూరల్ సెప్టెంబర్ 15: వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన చేనేత సహకార సంఘాలకు పునర్జీవం పోసే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత ఐదేళ్లు ఎన్నికలు నిర్వహించకుండా వైసీపీ ప్రభుత్వం అధికారుల కమిటీలతో సరిపెట్టింది. ఒక్క రూపాయి కూడా విడుదల చేయకుండా దెబ్బతీసింది. అంతకుముందు అమలైన పథకాలను సైతం నిలిపి వేసి కోలుకోలేని దెబ్బ తీసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన మూడు నెలల్లోనే ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించింది. జిల్లాలో ఎన్నికల అధికారుల నియామకంతో ఈనెల 21 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. డిసెంబర్ 6న కొత్త పాలకవర్గాలు కొలువు దీరనున్నాయి.

50 చేనేత సహకార సంఘాలు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన చేనేత సంఘాలు 50వరకు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 18, తూర్పుగోదావరి జిల్లాలో 9, అంబేద్కర్ కోనసీమలో 23 చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో చాలా వరకు నిర్లిప్తంగా ఉన్నాయి.

తొమ్మిది మంది సభ్యులతో..

చేనేత సహకార సంఘాలకు ఆంధ్రప్రదేశ్ సహకార చట్టం ప్రకారం చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఒక్కో సంఘానికి తొమ్మిది మంది సభ్యులతో పాలకవర్గాన్ని ఎన్నుకోనున్నారు. వీరిలో నుంచే అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడిని ఎన్నుకుంటారు. తొమ్మిది మంది సభ్యుల్లో ఇద్దరు కచ్చితంగా మహిళలు ఉండాలి. ఎన్నికల్లో నిల్చునేందుకు, ఓటు వేయడానికి సభ్యులు 300 షేరు ధనం కలిగి ఉండాలి. అలాగే మూడు నెలల నుంచి సొసైటీకి ఎటువంటి బకాయిలు ఉండకూడదని జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీ పెద్దిరాజు 'ఆంధ్రజ్యోతి' తెలిపారు. పాలకవర్గాల నియామకంతో చేనేత సంఘాల బలోపేతానికి అవకాశముందని సంఘాల్లోని కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయన్నారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో అమలైన యార్న్ సబ్సిడీ, మార్కెట్ ఇన్సెంటివ్, రిబేట్, ముద్ర రుణాలు, థ్రిఫ్ట్ ఫండ్ తదితర పథకాలను పునరుద్ధరిస్తామని ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో వీటిని గరిష్టంగా వినియోగించుకునేందుకు పాలకవర్గాల ద్వారా సంఘాల్లోని కార్మికులకు అవకాశం కలగనుంది.

గత ఐదేళ్లుగా ఎన్నికల కోసం ఎదురుచూపులు

2013 ఫిబ్రవరిలో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో చేనేత సహకార సంఘం ఎన్నికలు జరిగాయి. 2018 ఫిబ్రవరితో పాలకవర్గం సమయం ముగిసింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం చేనేత రంగాన్ని పూర్తిగా విస్మరించడంతో దిక్కు తోచని స్థితిలో ఇప్పటి వరకు చేనేత కార్మికులు ఉన్నారు. అయితే ఇప్పుడు చేనేత సహకార సంఘాలకు కూటమి ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వడంతో చేనేత కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే సహకార సంఘాల ఎన్నికల కోసం అధికారులు సమాయత్తమవుతున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

జడ్.రాగంపేటలో 3884 కిలోల బియ్యం, వాహనం సీజ్



జడ్.రాగంపేట వద్ద పట్టుకున్న పీడీఎస్ బియ్యం, వాహనం వద్ద అధికారులు

గండేపల్లి, సెప్టెంబర్ 15: మండలంలోని జడ్.రాగంపేట గ్రామంలో పెట్రోల్ బంక్ సమీపంలో జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. వ్యాన్‌లో ఉన్న బియ్యాన్ని తనిఖీ చేయగా అవి పీడీఎస్ బియ్యంగా గుర్తించి స్వాధీనపరచుకున్నారు. రీజనల్ విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ 93 బస్తాల్లో సుమారు 3884 కిలోల బియ్యాన్ని గుర్తించామన్నారు. ఈ బియ్యం కిర్లంపూడి మండలానికి చెందిన నల్లం శెట్టి లక్ష్మీనారాయణకు చెందినదిగా తెలిపారు. కిర్లంపూడి మండలం గోనేడ గ్రామం నుంచి దివాన్ చెరువు ప్రాంతంలోని పౌల్ట్రీ ఫారాలకు రవాణా చేస్తుండగా పక్కా సమాచారంతో పట్టుకున్నామన్నారు. రవాణాకు ఉపయోగించిన వాహనాన్ని స్వాధీన పరచుకుని డ్రైవర్ అరట గంగాధర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. బియ్యం, వాహనం విలువ రూ.11,28,714గా తెలిపారు. దీనిపై సివిల్ సప్లయ్స్ అధికారులు 6ఏ కేసు నమోదు చేసి అక్రమంగా తరలిస్తున్న వారిపై క్రిమినల్ కేసుల నమోదు కోసం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు నాగవెంకటరాజు, వీరబాబు, లోవరాజు, సీఎస్‌టీడీ కృష్ణ పాల్గొన్నారు.

'ఆ సొమ్ములు చెల్లిస్తున్నాం'

- కలెక్టర్ ప్రశాంతి

దివాన్‌చెరువు, సెప్టెంబరు15 : రాజానగరం మండలం జి.ఎర్రంపాలెం బ్యాంకు ఆఫ్ బరోడా బ్రాంచి (బీఓబీ)లో దుర్వినియోగమైన సొమ్ము రూ67.52 లక్షలను ఈనెల 17వ తేదీ మంగళవారం నుంచి బ్రాంచి నందు చెల్లింపులు జరుపుతామని జిల్లాకలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. . జి.ఎర్రంపాలెం బీఓబీ బ్రాంచ్‌కు చెందిన వ్యాపార కరస్పాండెంట్ ముత్తాబత్తులనానిబాబు ద్వారా కస్టమర్ల డిపాజిట్ల సొమ్ము దుర్వినియోగమైనట్టు గుర్తించామన్నారు. సంబంధిత ఖాతాదారులకు ఆ మొత్తాన్ని చెల్లించాలని బ్యాంకుఅధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈనెల 17 నుంచి జి.ఎర్రంపాలెం బ్రాంచ్‌లో డీఆర్‌డీఏ అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. దుర్వినియోగమైనట్టుగా గుర్తించిన రూ.67.52 లక్షలను ఎం/ఎస్ విజన్ ఇండియా టెక్ సర్వీసెస్ లిమిటెడ్ నుంచి వసూలు చేసి బాధిత ఖాతాదారులకు ఆయా మొత్తాలను రీయింబర్స్ చేయనున్నట్లు బ్యాంకు అధికారులు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారని కలెక్టర్ తెలిపారు. ఇందులో పుణ్యక్షేత్రానికి చెందిన 15 ఖాతాలకు సంబంధించి రూ26,69,000, కొండగుంటూరు పాకలకుచెందిన రెండు ఖాతాలకు రూ.81 వేలు, సంపత్‌నగరానికి చెందిన 6 గ్రూపుల ఖాతాలకు రూ.5,45,000, జి.ఎర్రంపాలేనికి చెందిన 41 ఖాతాలకు రూ34,11, 757లు దుర్వినియోగమైనట్టుగా గుర్తించామని డీఆర్‌డీఏ పథకసంచాలకులు ఎన్‌వీవీఎస్ మూర్తి తెలిపారని కలెక్టర్ పేర్కొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు



కంచుగరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

అంతర్వేది, సెప్టెంబరు 15: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నాలుగు రోజులుగా పవిత్రోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. చివరి రోజు ఆదివారం స్వామి, అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నవనారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు పరిపూర్ణమయ్యాయి. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, అభిషేకం, అలంకార తిరుమంజనం, ప్రాయశ్చిత హోమం, మహాశాంతి హోమం, పరమాత్మికోపనిషత్తు, శేషహోమం, పూర్ణాహుతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయమంతా భక్తులతో కిటకిటలాడింది. సాయంత్రం కంచు గరుడ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామపురవీధుల్లో స్వామి-అమ్మవార్ల ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది. పవిత్ర అవరోహణ, విశేషార్చన, నీరాజన మంత్రపుష్పాలు, పవిత్రముల వినియోగం జరిగాయి. కార్యక్రమంలో ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరాజగోపాలరాజాబహదూర్, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, గొట్టుముక్కల భీమరాజు, నల్లా సత్యకృష్ణకిరణ్‌ప్రసాద్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా అంతర్‌జిల్లాల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు

బాలురు విభాగంలో చిత్తూరు.. బాలికల విభాగంలో విశాఖ విజయం



విజేతలకు షీల్డ్‌లు అందజేస్తున్న ఈవో రామచంద్రమోహన్, యనమల రాజేష్

అన్నవరం, సెప్టెంబరు 15: మూడురోజులుగా కాకినాడ జిల్లా అన్నవరంలో జరుగుతున్న అంతర్ జిల్లాల బాల్‌బ్యాడ్మింటన్ పోటీల ఫైనల్స్ ఉత్కంఠ భరితంగా జరిగాయి. బాలుర విభాగంలో చిత్తూరు, శ్రీకాకుళం, విశాఖ, కడప జిల్లాలు వరుసగా తొలి నాలుగు స్థానాల్లో నిలిచాయి. బాలికల విభాగంలో విశాఖపట్నం, గుంటూరు, శ్రీకాకుళం, తూర్పుగోదావరి జట్లు వరుసగా మొదటి నాలుగు స్థానాల్లో నిలిచినట్లు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ ముప్పన వీర్రాజు తెలిపారు. అన్ని టీంలలో ప్రతిభకనబరిచిన వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుగా ఎంపికచేశారు. బాలుర రాష్ట్ర జట్టులో శ్రీకాకుళానికి చెందిన ఎస్.ప్రవీణ్‌కుమార్, జి.చాయకిరణ్, చిత్తూరుజిల్లాకు చెందిన వి.సి హేమచరణ్, కె.తేజేష్, కడపనుంచి కౌశిక్, తూర్పుగోదావరి నుంచి సుదర్శన్, విశాఖ నుంచి పైడినాయుడు, కర్నూల్ నుంచి తేజస్వీరెడ్డి, అనంతపూర్ నుంచి రాజశేఖర్, కృష్ణానుంచి శైలేంద్రకుమార్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో గుంటూరు నుంచి ఎం లుధియా, దేవమణి, తూర్పుగోదావరి నుంచి కుమారి, మానస ప్రణతి, విశాఖ నుంచి కీర్తన, శ్రీకాకుళం నుంచి జ్యోత్స్న చిత్తూరు నుంచి ప్రశాంతి, పశ్చిమగోదావరి నుంచి అనూషలు ఎంపికయ్యారు. వీరు రాష్ట్రం తరపున హర్యానాలో జరిగే పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారు. విజేతలకు దేవస్థానం ఈవో రామచంద్రమోహన్, టీడీపీ నేత యనమల రాజేష్ షీల్డ్‌లు అందజేశారు.

నరాలు తెగే ఉత్కంఠతో..



హోరాహోరీగా పవర్ లిఫ్టింగ్ చేస్తున్న క్రీడాకారులు



విజేతలుగా నిలిచిన క్రీడాకారిణులు

పురుషుల విభాగంలో రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు
మహిళా విజేతలకు పతకాలు అందజేత
స్ట్రాంగ్ ఉమెన్‌లుగా శ్రావణి, సాదియాఅల్మాస్, అనూష

అమలాపురం టౌన్, సెప్టెంబరు 15: అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్, కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక భూపయ్య అగ్రహారంలోని ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో రెండో రోజు ఆదివారం రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు పురుషుల విభాగంలో జరిగాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 455 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు, కార్యదర్శి వంటెద్దు వెంకన్నాయుడు, జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అర్ధరాత్రి వరకు పవర్ లిఫ్టింగ్ పోటీలు కొనసాగుతున్నాయి.

స్ట్రాంగ్ ఉమెన్లుగా శ్రావణి, సాదియాఅల్మాస్, అనూష

11వ రాష్ట్రస్థాయి మహిళల పవర్ లిఫ్టింగ్, బెంచ్‌ప్రెస్ చాంపియన్ షిప్ పోటీల్లో మహిళా విజేతల వివరాలను వెల్లడించారు. మహిళల సబ్‌జూనియర్స్ విభాగంలో 70 పాయింట్లతో కడప జిల్లా ప్రథమ, 45 పాయింట్లతో గుంటూరు ద్వితీయ, 37 పాయింట్లతో విజయనగరం జిల్లా తృతీయస్థానాన్ని సాధించింది. జూనియర్ మహిళల విభాగంలో 56 పాయింట్లతో గుంటూరు ప్రథమ, 47 పాయింట్లతో విజనగరం ద్వితీయ, 21 పాయింట్లతో ప్రకాశం తృతీయస్థానం సాధించింది. సీనియర్ మహిళల విభాగంలో గుంటూరు జిల్లా 70 పాయింట్లతో ప్రథమస్థానం, తూర్పుగోదావరి జిల్లా 33 పాయింట్లతో ద్వితీయస్థానం, 21 పాయింట్లతో ఎన్టీఆర్ జిల్లా తృతీయస్థానం సాధించింది. అనంతరం స్ట్రాంగ్ ఉమెన్ టైటిల్స్‌ను ప్రకటించారు. సబ్ జూనియర్ బాలికల విభాగంలో పి.శ్రావణి (గుంటూరు) ప్రథమ, పి.వందన (కోనసీమ) ద్వితీయ, హర్షితతివారి (వైఎస్సార్‌కడప) తృతీయ స్థానంతో స్ట్రాంగ్ ఉమెన్‌లుగా నిలిచారు. జూనియర్ మహిళ విభాగంలో ఎస్కే. సాదియాఅల్మాస్ (గుంటూరు) ప్రథమ, ఎం.షానూన్ (గుంటూరు) ద్వితీయ), ఎస్కే. సబీనా (గుంటూరు) తృతీయస్థానంతో స్ట్రాంగ్ ఉమెన్లుగా నిలిచారు. సీనియర్ మహిళల విభాగంలో డి.అనూష(ఎన్టీఆర్) ప్రథమ, బి.చంద్రిక(గుంటూరు) ద్వితీయ, ఎస్కే. సాదియాఅల్మాస్ (గుంటూరు) తృతీయ స్థానాలతో స్ట్రాంగ్ ఉమెన్లుగా నిలిచారు. మహిళల విభాగంలో వివిధ కేటగిరీల్లో నిర్వహించిన పోటీల్లో వరుస స్థానాలు సాధించిన పవర్ లిఫ్టర్లకు అసోసియేషన్ల పతకాలు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో అల్లాడ శరత్‌బాబు, డీవీ రమణ, ఎంఎస్ఎన్ మూర్తి, పప్పుల శ్రీరామచంద్రమూర్తి, యేడిద శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇంటిలో నిద్రిస్తుండగానే..

చోరీకి పాల్పడిన దొంగ
మెయిన్ డోర్ పగులగొట్టి 90గ్రాముల బంగారం, రూ.3 వేల నగదు అపహరణ

అనపర్తి, సెప్టెంబరు 15 : అనపర్తిలో వరలక్ష్మి టవర్స్‌లో శనివారం రాత్రి భారీ చోరీ జరిగింది. ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలోనే ఈ చోరీ జరిగిందని అనపర్తి ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. స్థానిక బాలుర ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న కాకి సత్య సునీత తన భర్తతో కలిసి అనపర్తి రైల్వే స్టేషన్ సమీపంలోని వరలక్ష్మి టవర్స్‌లో నివసిస్తున్నారు. శనివారం రాత్రి ఇంటి తాళాలు వేసుకుని ఒక బెడ్ రూమ్‌లో నిద్రకు ఉపక్రమించారు. తెల్లవారు జాము సమయంలో ముసుగు వేసుకున్న ఓ వ్యక్తి మెట్ల మార్గం ద్వారా వీరు ఉంటున్న ప్లాటు వద్దకు చేరుకుని మెయిన్ డోర్‌ను పగులగొట్టి లోనికి ప్రవేశించాడు. దంపతులు నిద్రిస్తున్న పక్క గదిలోకి ప్రవేశించి చాకచక్యంగా లాకర్‌ను పగులగొట్టి లాకర్‌లో ఉన్న సుమారు 90 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.మూడు వేల నగదు దోచుకుపోయాడు. తెల్లవారిన తరువాత విషయం తెలుసుకున్న దంపతులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శివగణేష్, ఎస్ఐ శ్రీను నాయక్‌లు సంఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీమ్‌కు సమాచారం అందించడంతో వారు వేలి ముద్రలను సేకరించారు. చోరీకి గురైన బంగారం విలువ సుమారు రూ.ఐదు లక్షల వరకు ఉంటుందని బాధితులు వాపోతున్నారు. బాధితురాలు సత్యసునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు.

తగ్గుతున్న గోదావరి

ధవళేశ్వరం, సెప్టెంబరు15: గోదావరి పరిస్థితి తగ్గుముఖం పట్టింది. సాయంత్రానికి గోదావరి నీటిమట్టం 9.50 అడుగులకు చేరుకోగా 6,90,849 క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. ఎగువన భద్రాచలం వద్ద నీటి మట్టం 35.30 అడుగులకు చేరుకుంది.

గంగమ్మ ఒడికి.. గణపయ్య

గణపతి నవరాత్రమహోత్సవాల ముగింపు సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వినాయక నిమజ్జన కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరిగాయి. చవితి పందిళ్లలో కొలువుదీరిన బొజ్జగణపయ్యలను ఊరేగింపు నడుమ గంగమ్మ ఒడికి చేర్చారు. సందడి వాతావరణంలో 'ఓ బొజ్జ గణపయ్యా.. వెళ్లి రావయ్యా' అంటూ సాగనంపారు. యువతీయువకులు, చిన్నారులు, పెద్దలు ఈ నిమజ్జన కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆ దృశ్యాలివే..





రాజమహేంద్రవరంలోని వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న భక్తులు



రాజమహేంద్రవరంలో గంగమ్మ ఒడికి చేరిన గణేశుడు



ప్రత్తిపాడులో గణేశ్ నిమజ్జనానికి తరలివెళుతున్న భక్తులు



కొత్తపల్లి మండలం ఉప్పాడ బీచ్‌లో వినాయకుడి ప్రతిమతో..



రాజమహేంద్రవరంలో గోదావరి చెంత నిమజ్జనానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

కిర్లంపూడి, సెప్టెంబర్ 15: కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం పాలెం గ్రామంలో వినాయక నిమజ్జనంలో అపశ్రుతి జరిగింది. వీరవరం గ్రామానికి చెందిన బి.లక్ష్మణరావు(33) ఏలేరు కాలువలో నిమజ్జనానికి వెళ్లి ప్రమాదవశాత్తూ బొమ్మకింద పడి మృతిచెందాడు. విషయాన్ని గ్రహించి గత ఈతగాళ్లు అతడిని బయటకు తీసి సీపీఆర్ చేసినా ఫలించలేదు. నీళ్లు ఎక్కువగా తాగడం వల్ల మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలిసిన జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, కిర్లంపూడి ఎస్ఐ సతీష్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బంధువులకు సమాచారం అందడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గణేశ్ నిమజ్జనాల్లో ఘర్షణ

కొత్తపల్లి, సెప్టెంబరు 15: గణేష్ నిమజ్జన వేడుకల్లో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరికి గాయాలైన సంఘటన కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం రమణక్కపేటలో జరిగింది. గణేష్ నవరాత్రులు ముగింపు సందర్భంగా ఆదివారం వినాయకుని నిమజ్జనం చేసేందుకు స్థానిక టీడీపీ నాయకుడు, ఉన్నత పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పెనుమల్లు సుభాకర్‌రెడ్డి వర్గం, వైసీపీ వర్గం నుంచి చింతపల్లి లక్ష్మీరెడ్డి ఊరేగింపుగా వెళ్లి ఊరి చివర ఉప్పుటేరులో వినాయకున్ని నిమజ్జనం చేశారు. వైసీపీ జెండాలతో గణేష్ నిమజ్జన ఊరేగింపు నిర్వహించడాన్ని టీడీపీ నాయకుడు సుభాకర్ రెడ్డి ఖండించారు. దీనికి కోపోద్రిక్తుడైన వైసీపీ నాయకుడు లక్ష్మీరెడ్డి కర్రతో సుభాకర్‌రెడ్డిని విచక్షణారహితంగా శరీరంపై కొట్టడంతో తట్లు తేలాయి. సుభాకర్ రెడ్డిని అడ్డుకోవడానికి వెళ్లిన పెనుమల్లు రాజుకు కూడా ఖర్రదెబ్బలు తగలడంతో ఇరువురు కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు గాయాలైన వ్యక్తులను చికిత్స కోసం పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన గ్యాస్ సిలిండర్ల లారీ

రాజానగరం, సెప్టెంబరు 15 : అనపర్తి నుంచి గుమ్మళ్లదొడ్డికి గ్యాస్ సిలిండర్లతో వస్తున్న లారీ మార్గమధ్యలో రాజానగరం మండలం తోకాడ గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తూ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని, కిళ్లీ దుకాణంలోకి దూసుకెళ్లింది. ఈ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్థులు చెబుతున్నారు. తనకు నీరసంతో కళ్లు తిరిగినట్లుగా అనిపించడం వల్లే లారీ అదుపుతప్పినట్లు డ్రైవర్ చెబుతున్నాడు. ఖాళీ సిలిండర్లు కావడం, ఎవరికి ప్రాణాపాయం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

పోలియో టీకా అధిక డోస్ : పసికందు మృతి

దేవీపట్నం, సెప్టెంబర్ 15: అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం దేవీపట్నం మండలంలోని ఇందుకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో లోతుపాలెం గ్రామానికి చెందిన రెండు నెలల పసికందు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలియో టీకా అధిక డోస్ వేయడంవల్లే మృతి చెందినట్టు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఆశా వర్కర్, ఆసుపత్రి నర్సు నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందంటున్నారు. దీనికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

తేటగుంటలో పేకాట శిబిరంపై దాడి

తుని రూరల్, సెప్టెంబరు 15: కాకినాడ జిల్లా తేటగుంటలో పేకాట శిబిరంపై రూరల్ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని పేకాట స్థావరంలో కుర్చీలు, టేబుల్, రూ.83,950లు సీజ్ చేసినట్టు ఎస్ఐ కృష్ణమాచార్యులు తెలిపారు. పట్టుబడిన వారిలో పలువురు వైసీపీ కీలక నాయకులు ఉండటం విశేషం. కేసు నమోదు చేసిన రూరల్ ఎస్ఐ పేకాట, గుండాట, కోడిపందేలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కారు ఢీ కొని కళాకారుడి మృతి

ప్రత్తిపాడు, సెప్టెంబరు15: ప్రత్తిపాడ-ధర్మవరం 16వ నెంబరు జాతీయ రహదారిపై రాచపల్లి అడ్డురోడ్డు వద్ద చిన్నకారు ఢీ కొన్న దుర్ఘటనలో అనకాపల్లికి చెందిన కళాకారుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. అనకాపల్లికి చెందిన 15 మంది తీన్‌మార్ కళాకారుల బృందం గుంటూరులో ప్రదర్శన ఇచ్చేందుకు శనివారం రాత్రి బయల్దేరారు. ఈ వ్యాన్ జాతీయ రహదారి రాచపల్లి అడ్డురోడ్డు వద్దకు చేరుకోగా అనకాపల్లికి చెందిన కళాకారుడు బి.అప్పారావు(45)అల్పాహారం కోసం హైవే రోడ్డు దాటి దాబా హోటల్ వద్దకు వెళ్లాడు. టిఫిన్ కట్టించుకుని తిరిగి రోడ్డు దాటుతుండగా అన్నవరం నుంచి రాజమండ్రి వెళ్లే కారువేగంగా అప్పారావును ఢీకొంది. ఈ సంఘటనలో కారు ఢీ కొన్న అప్పారావును తోటి కళాకారులు వారు వచ్చిన వాహనంలో ప్రథమ చికిత్స కోసం ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు. అప్పారావు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున అప్పారావు మృతి చెందాడు. దీనిపై ఎస్ఐ ఎం. పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడలో వ్యక్తి అనుమానాస్పద మృతి

కాకినాడ క్రైం, సెప్టెంబరు 15: ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన ఆదివారం కాకినాడలో జరిగింది. త్రీటౌన్ సీఐ కేవీవీ సత్యనారాయణ కథనం ప్రకారం.. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం, వీరవల్లిపాలేనికి చెందిన ముద్రగడ ఈశ్వరదుర్గాప్రసాద్ (39) కు భార్య నీలకంఠమణి, ఓ కుమారుడు ఉన్నారు. కాగా అతను కాకినాడలో లారీ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఏడాది క్రితం జీవనోపాధి నిమిత్తం భార్య, కుమారుడితో కలిసి హైదరాబాద్ వెళ్లి పోయాడు. అయితే రెండు నెలల క్రితం భార్య, కుమారుడిని అక్కడ వదిలేసి స్వగ్రామానికి వచ్చి.. తిరిగి హైదరాబాద్ వెళుతుండేవాడు. ఇది ఇలా ఉండగా కత్తుల దుర్గ అనే మహిళతో కాకినాడ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీధిలో కాస్మోహోటల్ పక్కన ఓ ఇంటిలో అద్దెకు ఉంటున్నాడు. ఈ క్రమంలో ఏమైందో కాని ఆదివారం ఆ ఇంటి ప్రాంగణంలో ఈశ్వరదుర్గాప్రసాద్ ఒంటిపై దెబ్బలతో విగత జీవిగా పడిఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు కాకినాడ ఎస్‌డీపీఓ రఘువీర్ విష్ణు, సీఐ సత్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురికి తరలించారు. హత్యకు దారి తీసిన కారణాలు తెలియాల్సి ఉంది. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి విరాళాలు



విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం, సెప్టెంబరు 15: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి ఆదివారం ఇరువురు దాతలు రూ రెండు లక్షలు విరాళంగా అందజేశారు. జగ్గంపేటకు చెందిన బొండా సుబ్బరాజు రూ.లక్షను పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. కందుకూరుకు చెందిన మరోదాత ఎం.శ్రీకాంత్ రూ.లక్ష అన్నదాన విభాగ సూపరింటెండెంట్ కంచి మూర్తికి అందించగా వారు దాతలను అభినందించి స్వామివారి ప్రత్యేకదర్శనం, ప్రసాదాలు అందజేశారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

EDUCATION

అన్ని Correspondence Courses కు, C.P.T (C.A), B.A, B.Com, Polytechnic Maths కు కోచింగ్ ఇవ్వబడును. దుర్గారమణమూర్తి కామర్స్, ఆర్ట్స్ & మేథమెటిక్స్ 27-4-15 opp C.M.R Jewellers Fed Bank Ltd వెనుక, దేవాలయం వీధి కాకినాడ సెల్: 9581261953

AJD:199511

WANTED

69 సం॥ కొంచెం మతి మరుపు వ్యక్తికి వంటకు మరియు వ్యాపారమునకు సహాయరాలు కావలెను. సంప్రదించండి సెల్ నెం : 7569879199.

AJG-191850

CHANGE OF NAME

★ I BANDARU SRI VENKATA PHANI SATYA GOWRI KARTHEEKI Alias POLISETTI SRI VENKATA PHANI SATYA GOWRI KARTHEEKI W/O BANDARU RAJA residing at 2-422, OLD PANCHAYATHI VEEDHI,VADAPALEM, KOTHAPETA EAST GODAVERI, ANDHRA PRADESH-533223,have changed my name to GOURI KARTHEEKI POLISETTI for all Future Purposes. AJH-54633

4 Lines CLASSIFIED Rs.230/- Only

రేపు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'

పెద్దాపురం, సెప్టెంబరు 15: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఈనెల 17న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని ఆర్డీవో జె.సీతారామారావు ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గం ట వరకూ ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తామన్నారు.

పవన్‌పై సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు

పిఠాపురం పోలీసుస్టేషన్‌లో జనసైనికుల ఫిర్యాదు



పిఠాపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిన జనసైనికులు

పిఠాపురం, సెప్టెంబరు 15: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కించపరిచే విధంగా సోషల్‌మీడియాలో అభ్యంతరకరంగా పెడుతున్న పోస్టులపై జనసైనికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇన్‌స్టా, ఇతర సోషల్‌మీడియాలో పవన్ ఫోటో పెట్టి జగన్‌తో పెట్టుకుంటే నీ పరిస్థితి ఇది, శ్రద్ధాంజలి అంటూ రామకృష్ణ7559గ్రూప్ పేరుతో పోస్టులు పెట్టారని వారు తెలిపారు. తక్షణం ఆ పోస్టును, ఇన్‌స్టా గ్రూపును తొలగించడంతో పాటు బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పవన్‌పై ఇటువంటి పోస్టులుపెడితే సహించేదిలేదని హెచ్చరించారు. ఫిర్యాదు ఇచ్చిన వారిలో అంకిరెడ్డి నాగగౌరీ, కోటేశ్వరరావు, కొండేపూడి శివ, గండేపల్లి గౌతమ్, పల్నాటి మధు, దానం లాజర్‌బాబు, గాదే కృష్ణ, ఎం.వంశీ, సీహెచ్.సూర్య తదితరులున్నారు.

ట్రాఫిక్ నియంత్రణ - హెల్మెట్ వినియోగంపై ర్యాలీ

కాకినాడ క్రైం, సెప్టెంబరు 15: ప్రతి ఒక్కరు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సహకరిస్తూ అలాగే హెల్మెట్ ధారణతో విలువైన ప్రాణాలను కాపాడుకునే విధానాలపై కాకినాడ ట్రాఫిక్ పోలీసులు ఆదివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం, భారీ ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశానుసారం కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్‌విష్ణు పర్యవేక్షణలో ట్రాఫిక్ 1సీఐ ఎస్.రమేష్, ట్రాఫిక్ 2 సీఐ డి.రామారావు ఆధ్వర్యంలో ట్రాఫిక్ రూల్స్ అలాగే రెగ్యులేషన్ అలాగే హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించేందుకు కాకినాడ టీవీఎస్ షోరూం నుంచి సరోవర్ పోర్టికో వరకు బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం సదస్సు నిర్వహించారు. ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్, మితిమీరిన వేగం వల్ల వచ్చే ప్రమాదాలపై వివరించారు. విఎస్ నిఖిల్, హేమంద్రరావు, 70 మంది బైక్ రైడర్స్ సభ్యులు, 80 మంది క్యాస్ట్రాల్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా గణేష్‌స్వాముల ఇరుముడి ధారణ

పిఠాపురం, సెప్టెంబరు 15: పట్టణంలోని కోటగుమ్మం సెంటర్‌లో వేంచేసి ఉన్న జైగణేష్ దేవస్థానంలో గణపతిమాల ధరించిన స్వాముల ఇరుముడి ధారణ ఆదివారం వైభవంగా జరిగింది. జైగణేష్‌స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. సాయంత్రం గణేష్ నగరోత్సవం ఘనంగా జరిగింది. గణేష్‌స్వామిని పల్లకిపై ఉంచి ఉత్సవాన్ని జరిపించారు. స్వాములు పట్టణంలో గణపతి నామస్మరణ చేసుకుంటూ ప్రదర్శన నిర్వహించారు. మధ్యాహ్నం వాసవికన్యకా పరమేశ్వరీ ఆలయంలో అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాల్లో ఆలయ ఈవో నున్న శ్రీరాములు, ప్రధాన అర్చకుడు మైలవరపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. జైగణేష్ స్వామిని కాకినాడ మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ దర్శించుకుని పూజలు నిర్వహించారు.

లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ సమావేశం

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 15: కాకినాడ కాస్మోపాలిటన్ క్లబ్ సమావేశ మందిరంలో ఆదివారం లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ సమావేశం జరిగింది. అధ్యక్షురాలు ఎంవిఎస్ఎల్ ప్రసూన అధ్యక్షతన జరిగిన సమావేశంలో గీతా పరివార్ సాంకేతిక శిక్షకురాలు పి.భాస్కరఅనంతలక్ష్మి పాల్గొని 'రోల్ ఆఫ్ పాజిటివ్ థింకింగ్ ఇన్ లైఫ్' అంశంపై ప్రసంగించారు. లయన్స్ డిస్ట్రిక్ట్ పాస్ట్ గవర్నర్ డాక్టర్ వీఎస్‌వీడీ శివప్రసాద్ మాట్లాడారు. అనంతరం ఇంజనీర్స్ డే నిర్వహించారు. ముఖ్య అతిథి, లయన్స్ డిస్ట్రిక్ట్ పాస్ట్ గవర్నర్ ముంజులూరి విశ్వేశ్వరరావు చేతుల మీదుగా హైదరాబాద్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్ టి.సునీత, క్లబ్ మెంటార్ ఇంజనీర్ ఎంవీ శాస్త్రి, లయన్స్ క్లబ్ ఎలైట్ సభ్యుడు ఇంజనీర్ బీవీ కిషోర్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సత్యమూర్తి, క్లబ్ కార్యదర్శి ఎన్.శ్రీదేవిరెడ్డి, కోశాధికారి బి.శ్రీవాణి పాల్గొన్నారు.

'సాంకేతిక విద్యను అలవర్చుకోవాలి'

ఏలేశ్వరం, సెప్టెంబరు 15: సాంకేతిక విద్యను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని స్పార్క్ చైర్మన్ సాయి సందీప్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని యర్రవరం స్పార్క్ కార్యాలయలో యువతీ యువకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువతీ,యువకుల్లో శాస్త్రీయ భావజాలాన్ని సుసంపన్నం చేయడమే లక్ష్యంగా స్పార్క్ ఫౌండేషన్ పాటుపడుతోందన్నారు. స్పార్క్ ఫౌండేషన్ నుంచి సైంటిఫిక్ టెంపర్ని ఆధారంగా ఆధునాతన శిక్షణ, సైబర్ సైన్స్ పరిశోధన, శాటిలైట్ ఫాబ్రిక్ వివిధ టెక్నాలజీలపై మెట్ట మెదటిసారి రాష్ట్రంలో మిషన్‌లను అభివృది చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రవి కిరణ్, ఆదిత్య, రోజి, సాహల్, నవనీత్, రవి తదితరులు ఉన్నారు.

'ప్రజల మన్ననలు పొందాలి'

ప్రత్తిపాడు, సెప్టెంబరు 15: అంకితభావంతో సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని ప్రత్తిపాడు సీఐ బి.సూర్యఅప్పారావు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అడిషనల్ ఎస్ఐగా పని చేసి కృష్ణాజిల్లాకు బదిలీ అయిన మధుసూధనరావును ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ, ఎస్ఐ ఎం.పవన్‌కుమార్ అభినందించి సన్మానించారు. మధుసూధనరావు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పీసీలు సుబ్రహ్మణ్యం, గోవిందు, రమేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వరద ముంపు బాధితులకు నిత్యావసర కిట్లు

తొండంగి, సెప్టెంబరు 15: మండలంలో వరద ముంపుబారిన పడిన గ్రామాల బాధిత కుటుంబాలకు ఆదివారం నిత్యావసర కిట్లు పంపిణీ చేశారు. పెరుమాళపురం, కోదాడ, శృంగవృక్షంలో 2034 మంది కుటుంబాలకు నిత్యావసర సరుకులతో కూడిన కిట్లను టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్ పంపిణీ చేశారు. తహశీల్దార్ మురార్జీ, ఆర్ఐ వెంకటేశ్వరావు, టీడీపీ నేతలు కొయ్యా రామకేశవ, కోడ వెంకటరమణ, యాదాల రాజబాబు, రామకృష్ణ, బంటుపల్లి అన్వేష్, అరిగెల నర్శింహమూర్తి, కాలిబోయిన చంద్రరావు, పిర్ల శివ, చొక్కా అప్పారావు, బుర్తి సింహాచలం పాల్గొన్నారు.

నాగదుర్గాశ్రీసాయికి సత్కారం

సామర్లకోట, సెప్టెంబరు 15: తూర్పుగోదావరి జిల్లా లయన్స్ సెంటిన్యుయల్ విద్యా ప్రోత్సాహకంలో భాగంగా సామర్లకోట మండలం వెంకటకృష్ణరాయపురం గ్రామానికి చెందిన ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం చదువుతున్న తలారి నాగదుర్గాశ్రీసాయికి ఆదివారం లయన్స్ క్లబ్ ప్రతినిధుల సమక్షంలో అభినందన సత్కారం నిర్వహించారు. లయన్స్ విద్యాప్రోత్సాహకంలో భాగంగా ఈ ట్రస్ట్ ద్వారా లాప్‌టాప్‌తో బాటూ రూ.45 వేల నగదు అందజేసారు. ఇదేరీతిలో మెరిట్ కొనసాగిస్తే రానున్న నాలుగేళ్లు నగదు ప్రోత్సాహాన్ని అందజేయనున్నట్లు లయన్స్ ప్రతినిధి ఈదర ఈశ్వరకుమార్ చెప్పారు. ట్రస్ట్ ప్రతినిదులకు విద్యార్థిని తల్లితండ్రులు, మాజీ సర్పంచ్ తలారి శ్రీలక్ష్మీదొరబాబు కృతజ్ఞతలు తెలిపారు. లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ బీవీఎస్.రెడ్డి, ట్రస్ట్ గౌరవ చైర్మన్ ఈదర ఈశ్వర్‌కుమార్, డాక్టర్ బాదం బాలకృష్ణ, తలారి రామచంద్రరావు పాల్గొన్నారు.

Anand CINEMAS (4 SCREENS)
Experience it in 4K Dolby Atmos
BHANUGUDI JUNCTION KAKINADA
DEVI CINEMAS (4 SCREENS)
Experience it in 4K Dolby Atmos
CINEMA ROAD KAKINADA
BOOK ONLINE TICKETS paytm
NOW SHOWING
SARIPODHAA SANIVARAM (U/A) TEL
11-30AM, 02-50PM, 06-20PM, 9-40PM
35 CHINNA KATHA KADU (U) TEL :
11-45AM, 02-40PM, 06-15PM, 09-15PM
A.R.M. (U/A) TEL - 3D
11-15AM, 02-30PM, 06-30PM, 09-45PM
MATHU VADALARA 2 (U/A) TEL
11-20AM, 02-15PM, 06-40PM, 09-30PM
SARIPODHAA SANIVARAM (U/A) TEL
11-20AM, 02-45PM, 06-30PM, 9-50PM
THANGALAAN - TEL :
11-40AM, 2-30PM, 6-45PM, 9-40PM
35 CHINNA KATHA KADU (U) TEL :
11-30AM, 02-15PM, 06-15PM, 09-30PM

గణేష్ మహరాజ్ కీ జై!

వైభవంగా వినాయక విగ్రహాల నిమజ్జనం
ఆటోలు, ట్రాక్టర్లపై ఊరేగింపు



సర్పవరం జంక్షన్: విగ్రహాన్ని సముద్రంలోకి తీసుకెళ్తున్న భక్తులు, ఏలేశ్వరంలో, పిఠాపురంలో వినాయక నిమజ్జనం సందడి దృశ్యాలు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 15: కాకినాడ రూరల్ సూర్యారావుపేట సముద్రతీరం భక్తులతో కిటకిటలాడింది. గణపతి మొప్పా మోరియా, గణేష్ మహరాజ్ కీ జై అనే నామస్మరణతో అశేష భక్తులు వినాయక విగ్రహాలతో ఊరేగింపుగా వచ్చి అత్యంత భక్తి శ్రద్ధలతో సముద్రంలో నిమజ్జన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. నగర గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీసు, పీఆర్ అధికారుల ఆధ్వర్యంలో గణేష్ విగ్రహాల నిమజ్జనానికి అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. కాకినాడ రూరల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో వాడవాడలా ప్రత్యేక మండపాల్లో కొలువుదీరిన గణ నాయకులను ఆటోలు, ట్రాక్టర్లలలో సూర్యారావుపేట సాగరతీరానికి తీసుకొచ్చారు. భారీ విగ్రహాలను క్రేన్‌ల సహాయంతో సముద్రంలో నిమజ్జనం చేశారు. కాకినాడ మెరైన్ సీఐ రామోహ్మన్‌రెడ్డి, కాకినాడ రూరల్ సర్కిల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు ఆధ్వర్యంలో బీచ్‌లో బందోబస్తు నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు లేకుండా పకడ్బందీ ఏర్పాటు చేశారు.

రూ.లక్ష పలికిన గణపతి లడ్డూ

వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి తిమ్మాపురం శివారు అవంతినగర్‌లో నిర్వహించిన స్వామివారి లడ్డూ వేలం పాటలో స్థానికులు చంటిబాబు, చల్లారాం దంపతులు లక్ష రూపాయలకు లడ్డూను సొంతం చేసుకున్నారు. స్వామివారి చెంత లడ్డూను ఉంచి ఊరేగింపుగా ఇంటికి తోడ్కెళ్లి కుటుంబ సభ్యులు, స్థానికులకు లడ్డూ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 2 వేల మందికి అన్నదానం చేశారు.

కొత్తపల్లి: ఉప్పాడ బీచ్ ఆదివారం గణేష్ నిమ్మజ్జనాలతో హోరెత్తింది. పిఠాపురం, నవఖండ్రవాడ, కొండెవరం, ఇసుకపల్లి, వాకతిప్ప, కొత్తపల్లి తదితర ప్రాంతాల నుంచి వినాయకుని విగ్రహాలను భక్తులు ట్రాక్టర్లపై డీజే సౌండ్స్‌తో ఊరేగించుకుంటూ బీచ్ రోడ్డుకు చేరుకున్నారు. ట్రాక్టర్లపై భారీ వినాయక విగ్రహాలను నిమ్మజ్జనం చేసే భక్తులకు సుబ్బంపేట రేవులో సముద్రంలోపలికి వెళ్లేందుకు స్థానిక పంచాయతీ పాలకవర్గం దారి ఏర్పాటుచేశారు. నిమ్మజ్జనాల్లో భక్తులకు ఏ ఇబ్బందులు కలుగకుండా, బీచ్ రోడ్డు ప్రయాణించే వాహనలకు అంతరాయం కలుగకుండా కొత్తపల్లి ఎస్ఐ జి.వెంకటేష్ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. కొత్తపల్లిలో తాపీ మేస్త్రీల సంఘం, గ్రామస్తుల సహకారంతో భారీ అన్నసమారాధన నిర్వహించారు. 5వేలమంది పాల్గొన్నారు.

పిఠాపురం: పిఠాపురం ఆదివారం గణేష్ నామస్మరణతో మారుమోగింది. వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా పలుచోట్ల ప్రత్యేకపూజలు నిర్వహించారు. అన్నదానాలు జరిగాయి. వివిధ ప్రాంతాల్లో నిలిపిన గణనాధులను వాహనాలపై ఉంచి నిమజ్జనానికి తరలించారు. చిన్న విగ్రహాలను పట్టణ శివారులో ఉన్న ఏలేరు, పీబీసీ కాలువల్లో నిమజ్జనం చేశారు. భారీ విగ్రహాలను ఉప్పాడ వద్ద సముద్రంలో నిమజ్జనం చేసేందుకు ప్రదర్శనగా తరలివెళ్లారు. పట్టణంలోని దత్తనగర్‌లో వేంచేసి ఉన్న లక్ష్మీగణపతి ఆలయంలో జరుగుతున్న గణపతి హోమానికి మహాపూర్ణాహుతి నిర్వహించారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు, ధర్మవరం, ఒమ్మంగి, పెద్దిపాలెం, రాచపల్లి, ఏలూరులలోని గణేష్ విగ్రహాలను అయా గ్రామాల్లోని చెరువుల్లో నిమజ్జనం చేశారు. గణేష్ మండపాల వద్ద అన్నదానాలు నిర్వహించారు. పలుమండపాల వద్ద గణేష్ ఉత్సవ వేడుకలను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సందర్శించారు.

గండేపల్లి: మల్లేపల్లిలో వినాయకుని విగ్రహం వద్ద కమిటీ సభ్యులు లడ్డూ పాట నిర్వహించారు. ఉపసర్పంచ్ దొమ్మా శ్రీను లడ్డూను రూ.6వేలుకు పాట దక్కించుకుని ప్రసాదంగా పంపిణీ చేశారు.

గొల్లప్రోలు: పట్టణంలో వినాయక నిమజ్జనోత్సవం వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల్లో నిలిపిన వినాయక విగ్రహాలను ట్రాక్టర్లు, ఆటోలు, ఇతర వాహనాలపై ఉరేగించారు. పలు విగ్రహాలను రైల్వేస్టేషన్ వద్ద గల పీబీసీ కాలువలో నిమజ్జనం చేశారు. మిగిలిన వాటిని ప్రదర్శనగా ఉప్పాడ సముద్రం వరకూ తీసుకువెళ్లి అక్కడ నిమజ్జనం చేశారు.

కిర్లంపూడి: మండలంలో సోమవరం గ్రామంలో జైగణపతి యూత్ ఏనుగుపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గణపతి నిమజ్జనం ఘనంగా నిర్వహించారు.

ఏలేశ్వరం: ఏలేశ్వరం లారీ యూనియన్ కార్యాలయం వద్ద, సువ్వయ్యమ్మపేట, లింగంపర్తి, భద్రవరం, చిన్నింపేట గ్రామాల నుంచి గణపతి విగ్రహాలను మహిళలు, యువత తీన్ మార్, బాణసంచాలతో తీసుకెళ్లి ఏలేరు నదిలో నిమజ్జనం చేశారు.

జగ్గంపేట: బాలాజీనగర్‌లోని వినాయక చవితి పందిరంలో గణపతి లడ్డూపాటను కింగంసరితాదేవి రామకృష్ణ రూ.15,500వరకు దక్కించుకున్నారు.

'లోవ'లో భక్తుల కోలాహలం

ఆలయానికి రూ.2.88లక్షల ఆదాయం



తలుపులమ్మ, ఆలయ ప్రాంగణంలో వంటా వార్పు చేసుకుంటున్న భక్తులు

తుని రూరల్, సెప్టెంబరు 15: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించిన అర్చకస్వాములు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. ప్రత్యేక క్యూలో బారులుతీరిన భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వసతుల్లో వంటావార్పులు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆలయానికి ఆదివారం వివిధ విభాగాల నుంచి రూ.2.88లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో విశ్వనాథ రాజు తెలిపారు.

ఎమ్మెల్యే పూజలు

లోవ దేవస్థానంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పూజలు ఆచరించారు. ఆమెకు ఆలయ మర్యాదలతో అధికారులు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆలయ పండితులు వేద ఆశీర్వచనాలు అందజేయగా ఆలయ ఈవో అమ్మవారి చిత్రపటంతో తీర్థప్రసాదాలను అందజేశారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు వెన్నశివతో పాటు పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

సత్యదేవుడికి వేడుకగా రథసేవ



రథసేవలో పాల్గొన్న భక్తులు, అధికారులు

అన్నవరం, సెప్టెంబరు 15: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి ఆదివారం ఆర్జితసేవ అయిన రథసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు సర్వాంగసుందరంగా వివిధ సుగంధభరిత పుష్పాలతో అలంకరించిన టేకురథంపై ఆశీనులు గావించి అర్చకస్వాములు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం స్వామి,అమ్మవార్లను రథంపై భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల మంత్రోచ్చరణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సహాయకమిషనర్ విశ్వనాథరాజు పీఆర్వో కృష్ణారావు, సూపరెంటెండెంట్‌లు కంచి మూర్తి, ఐవీ రామారావు, ఏపీఆర్వో ఎం.గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక మేట్లతో రైతుల అవస్థలు



పెదశంకర్లపూడిలో కౌలు రైతు బొర్రా సత్తిబాబు పొలంలో వరదలకు ఇసుక మేట వేసిన దృశ్యం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 15: వరదల కారణంగా ఏర్పడిన ఇసుక మేట్లతో ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి రైతాంగం అవస్థలు పడుతున్నారు. వారంరోజులు కిందట సంభవించిన భారీ వర్షాలు, వరదలకు గ్రామంలోని రానంశెట్టి నారాయణరావు, కైలు రైతు బొర్రా సత్తిబాబులకు చెందిన వరి పంట పొలాల్లో పెద్ద ఎత్తున ఇసుక మేట్ల ఏర్పడ్డాయి. సుబ్బారెడ్డి సాగర్, ఎర్రకాలువ పొంగి ప్రవహించడంతో రైతుల పంట పొలాలను ఇసుక మేటవ ముంచెత్తాయి. అయితే వీటిని తొలగించడానికి నానా అవస్థలు పడుతున్నారు. వీటిని తొలగించడానికి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



సోమవరంలో నిత్యావసరాలు అందజేస్తున్న నెహ్రూ

కిర్లంపూడి, సెప్టెంబరు 15: ఏలేరు వరద పట్ల ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సూచించారు. సోమవరంలో పంచాయతీలో బాధితులకు 25 కిలోల బియ్యం, 5రకాల నిత్యావసర సరుకులు ఆయన అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ముందు చూపు ఉన్న సీఎం చంద్రబాబు వరద బాధితులను వెంటనే ఆదుకున్నారన్నారు. కార్యక్రమంలో జంపన సీతారామచంద్రవర్మ, చదరం చంటిబాబు, సూతి శ్రీను, మంచికంటి శ్రీను, పేపకాయల బుజ్జి, గంగిరెడ్ల దొరబాబు ఉన్నారు. మండలంలోని రాజుపాలెంలో ఏలేరు వరద బాధితులకు ఏలేశ్వరం మండలం సిరిపురానికి చెందిన మనం సేవ ఫౌండేషన్ సాయం అందించింది. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా 165 బాధిత కుటుంబాలకు దుప్పట్లు, లుంగీలు, పంచెలు, కరాచీ నూక అందజేశారు. మనం సేవ ఫౌండేషన్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, గంధం ఈశ్వరరావు, గొడె దొరబాబు, ఎస్వీఎస్ అప్పలరాజు, కొత్త కొండబాబు, బస్వా వీరబాబు, దనేకుల వీరభద్రరావు, మంగా శ్రీనివాస్, వెలుగూరి హరేరామ్, సంఘన, ప్రభాజి, గంగరాజు ఉన్నారు. రామకృష్ణాపురం, రాజుపాలెం, ముక్కొల్లు గ్రామాల్లో పంట పొలాలు ముంపుకు గురికావడంతో ఆయా ప్రాంతాలను, ముక్కొల్లు రెగ్యులేటర్ వద్ద గండి పడిన ప్రాంతాన్ని ఆర్డీవో పరిశీలించారు. కాలువకు గండ్లు పడడంతో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ

కిర్లంపూడి మండలం రామచంద్రపురంలో ఏలేరు వరద ముంపుకు గురైన బాధిత కుటుంబాలకు ఆదివారం బియ్యం, 5 రకాల నిత్యావసరాల కిట్లను జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. రమేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వరద బాధితులను అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు.



రామచంద్రపురంలో కిట్లు ఇస్తున్న తుమ్మలపల్లి

ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా కృషి : ఎమ్మెల్యే రాజప్ప



ఎమ్మెల్యేకు చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

సామర్లకోట, సెప్టెంబరు 15: గణపతి ఉత్సవాలు ముగింపు పురస్కరించుకుని సామర్లకోట పట్టణం, మండలంలోనూ పలు చవితి ఉత్సవ పందిళ్ళ వద్ద ఆదివారం జరిగిన విశేష పూజలు, ఉత్సవ కమిటీలు ఏర్పాటుచేసిన మహాన్న దానాల్లో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించి పండితుల ఆశీర్వచనాలు, ప్రసాదాలు స్వీకరించారు. మహాన్న దానాలను ప్రారంభించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులను ఎమ్మెల్యే అభినందించారు. సమాజంలో ఇటువంటి కార్యక్రమాల ద్వారా ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా అందరూ కృషిచేయాలని కోరారు. వేట్లపాలెం మంగయ్యమ్మ కాలనీ, సామర్లకోట బళ్ళ మార్కెట్ గణపతి ఆలయం, సంపెంగతోట గణపతి ఉత్సవ పందిరి వద్ద, నిమ్మతోటల వద్ద మహాన్నదానాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కూటమి నాయకులు, ఉత్సవకమిటీ నాయకులు ఉన్నారు.

పూడిక తొలగింపు పనుల పరిశీలన

సామర్లకోట వివిధ వార్డుల్లో మున్సిపల్ అధికారులు చేపడుతున్న ప్రధాన కాలువల్లో పూడిక తొలగింపు పనులను ఎమ్మెల్యే చినరాజప్ప పరిశీలించారు. కాలువల పరిసరాల్లో ఆక్రమణలు తొలగించి పూడిక పూర్తిస్థాయిలో తొలగించి పట్టణానికి ముంపు బెడద శాశ్వతంగా తొలగిపోయేలా మున్సిపల్ అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య, టీడీపీ నాయకులు, కాలువ వెంబడి నివాసస్తులతో ఎమ్మెల్యే సమీక్షించారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు ఉన్నారు.

'దేశానికి విశిష్ట సేవలందించిన విశ్వేశ్వరయ్య'

ఘనంగా ఇంజనీర్ల దినోత్సవం



సర్పవరం జంక్షన్: రిటైర్డు ఇంజనీర్లకు సత్కారం

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 15: ఇంజనీరింగ్ వ్యవస్థలో దేశానికి అత్యుత్తమ విశిష్ట సేవలు అందించి ఇంజనీరింగ్ పితామహుడుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య నిలిచారని ఏపీ ట్రాన్స్ కో రిటైర్డు సూపరింటెండెంట్ ఇంజనీర్ అడ్డాల వీరభద్రరావు అన్నారు. ఆదివారం స్థానిక ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ అధ్యక్షుడు రత్నప్రసాదరావు ఆధ్వర్యంలో ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ ఇంజనీర్లకు స్ఫూర్తి ప్రదాతగా మోక్షగుండం నిలిచారన్నారు. రిటైర్డు ఇంజనీర్లు అడ్డాల వీరభద్రరావు, అరుణ రేఖలను సత్కరించారు. డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, ఆర్ బాపిరాజు, ప్రసాద్‌నాయుడు, బి.సత్యనారాయణరాజు, అడబాల సత్యనారాయణ, రాఘవరావు ఉన్నారు.

పెద్దాపురం: మండల పరిధిలోని దివిలి కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు భారత ఇంజనీరింగ్ పితామహుడు, భారతరత్న అవార్డు గ్రహీత డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య భారత ఇంజనీరింగ్ ప్రతిభను దశదిశలా వ్యాపింపచేశారని, ఆయన అడుగు జాడల్లో నేటి ఇంజనీర్లు పయనించాలన్నారు. కళాశాల ఏవో కేఆర్ సందీప్, ఈవో జెన్నిబాబు, ఏసీవో పెదకాపు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మకమలం



పెద్దాపురం, సెప్టెంబరు 15: కింగ్ ఆఫ్ హిమాలయ ఫ్లవర్‌గా పిలిచే బ్రహ్మకమలం పెద్దాపురం పట్టణంలో కొత్తపేటలో నివసిస్తున్న ఆదిరెడ్డి విజయలక్ష్మీ గృహంలో వికసించింది. సంవత్సరానికి ఒకసారి మాత్రమే ఈబ్రహ్మకమలం వికసిస్తుంది. పుష్పాన్ని చూసేందుకు చుట్టుపక్కల వారు తరలివచ్చారు.

యువగణపతికి కాయగూరలతో అలంకారం



యువగణపతికి పూజలు చేస్తున్న భక్తులు

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 15: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని అపర్ణాదేవి ముఖద్వారం వద్దనిలిపిన యువగణపతికి ఆదివారం కాయగూరలతో అలంకారం చేశారు. వేద పండితుడు ఆకొండి ప్రభాకరశాస్త్రి ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు జరిగాయి. గణేష్ నవరాత్రి ఉత్సవకమిటీ ప్రతినిధులు దాసం వాసు, అడపా గోవిందు తదితరులు ఉన్నారు.

రేపు ప్రత్తిపాడు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 15: ప్రత్తిపాడు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఈ నెల 17న నిర్వహించనున్నట్టు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌమ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చైర్మన్‌గా వ్యవహరించే ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు జరుగుతుందన్నారు.

పెద్దాపురం డీఎస్పీ బదిలీ

పెద్దాపురం, సెప్టెంబరు 15: పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి బదిలీ ఆయ్యారు. ఆమె స్థానంలో ఏసీబీ డీఎస్పీగా పనిచేస్తున్న డి.శ్రీహరిరాజు పెద్దాపురం డీఎస్పీగా రానున్నారు. లతాకుమారిని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆమె గత ఏడాది ఏప్రిల్ 28న పెద్దాపురం డీఎస్పీగా బాధ్యతలను చేపట్టారు.

కరాటే శిక్షణా తరగతులు

జగ్గంపేట, సెప్టెంబరు 15: మణికర్ణిక యువజన సంఘం ఆధ్వర్యంలో జగ్గంపేట డిగ్రీ కళాశాల ఆవరణలోని బీసీ మహిళా హాస్టల్‌లో విద్యార్థినులకు కరాటే శిక్షణా తరగతులు ప్రారంభించారు. హాస్టల్ వార్డెన్ రాఘవమ్మ, మణికర్ణిక యువజన సంఘ వ్యవస్థాపక అధ్యక్షురాలు గున్నాబత్తుల అనూష, సభ్యులు లక్ష్మి, శ్రీను, స్వామి, వీరబాబు ఉన్నారు.

వీరశివకు ఉత్తమ సేవా పురస్కారం

పెద్దాపురం, సెప్టెంబరు 15: మండలంలోని ఆనూరుకి చెందిన కర్రి వీరశివకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. కాకినాడలో నిర్వహించిన చేయూత స్వచ్ఛంద సంస్థ ఏడవ వార్షికోత్సవం సందర్భంగా సేవాదాతలకు ఈ అవార్డులను అందించారు. వీరశివను జనసేన కాకినాడ జిల్లా ఇన్‌చార్జ్ తుమ్మల రామస్వామి (బాబు) అభినందించారు.

వెంకటేశ్వరరావు సిద్ధాంతి మృతి

పెద్దాపురం, సెప్టెంబరు 15: కాండ్రకోటలో ప్రముఖ సిద్ధాంతిగా పేరున్న ఒబిలిశెట్టి వెంకటేశ్వరరావు సిద్ధాంతి (75) ఆదివారం మృతిచెందారు. ఇటీవల ఆయన హృద్రోగ సంబంధిత ఆపరేషన్ చేయించుకున్నారు. పరిస్థితి విషమించడంతో మృతిచెందారు. పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

పిఠాపురం, సెప్టెంబరు 15: పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానం ఎదురుగా ఉన్న షెడ్డులో పేకాట ఆడుతున్న వారిపై ఎస్ఐ నౌడు రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడి చేశారు. నలుగురిని అరెస్టు చేసి రూ.4,250 స్వాధీనం చేసుకున్నారు.

పంటకాలువలో పూడికతీత

తాళ్లరేవు, సెప్టెంబరు 15: పోలేకుర్రు, గాడిమొగ ప్రధాన పంటకాలువలో పేరుకుపోయిన చెత్తను కాంట్రాక్టరు అ ల్లూరి రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో కూలీలు తొలగించారు. మరో 2రోజుల్లో పూడిక మెరక పల్లాలను తొలగిస్తామన్నారు.

మహారాజశ్రీ కాకినాడ 3వ అదనపు సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో
FDIA 04/2024, OS 161/1965
Between:
1.దాట్ల జోగి జగన్నాథ రాజు, (died)
సత్యవాయి ఉదయ అండ్ అదర్స్ ... పిటీషనర్స్
మరియు
1.దాట్ల సూర్యనారాయణ రాజు, (died)
దాట్ల సత్యవతి అండ్ అదర్స్ ... రెస్పాండెంట్సు
To శ్రీమతి దాట్ల క్రిష్ణ గాయత్రి
W/o. పీవ వెంకట సత్యనారాయణ రాజు డోరు నెం. 5-129 యు.కొత్తపల్లి, యు.కొత్తపల్లి మండలం, కాకినాడ జిల్లా
ప్రకటన
పై చెంబరు కేసులో పైన తెలిపిన కోర్టులో మీ హాజరు నిమిత్తం చివరి సారిగా ది.30-09-2024 సం॥ తేదీ నాటికి వాయిదా సదరు వాయిదా రోజున ఉదయం 10.30 గంటలకు పైన తెలిపిన కోర్టులో మీరు స్వయంగా గాని మీ తరుపున ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ అక్షేపణలు ఏమైన ఉన్నయెడల శ్రీ కోర్టు వారికి తెలియ పర్చవలెను లేని యెడల సదరు తీర్పు మీ పరోక్ష మందు తీర్మానించబడును. ఇందు మూలముగా తెలియజేయడమైనది.
కాకినాడ
తేది:15.09.24
శ్రీ రాచకొండ వెంకట సుబ్రహ్మణ్యం, పిటీషనర్ల తరుపున న్యాయవాది
కాకినాడ సెల్:9848229704

ప్రపంచ 'లా' డే శుభాకాంక్షలు
న్యాయవాదులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
వరల్డ్ 'లా' డే శుభాకాంక్షలు
చిటికిన కనక దుర్గారావు
అడ్వకేట్, పెద్దాపురం
సెల్:9848321584
చిటికిన చంద్రశేఖర్
అడ్వకేట్, పెద్దాపురం
సెల్:8019226422

'లా' డే శుభాకాంక్షలు
న్యాయమూర్తులకు పిఠాపురం బార్ అసోసియేషన్ సభ్యులకు మరియు న్యాయవాద మిత్రులకు, శ్రేయోభిలాషులకు 'లా' డే శుభాకాంక్షలు
మేరుగు రాజారావు
అధ్యక్షులు: పిఠాపురం బార్ అసోసియేషన్
సెల్: 9440522671
శ్రీమతి మేరుగు రమణి
అడ్వకేట్
పిఠాపురం

ప్రపంచ 'లా' డే శుభాకాంక్షలు
న్యాయమూర్తులకు, ది పిఠాపురం బార్ అసోసియేషన్ సభ్యులకు, నా తోటి మిత్రులకు, శ్రేయోభిలాషులకు 'లా' డే శుభాకాంక్షలతో...
K.S.R. భాస్కర్
అడ్వకేట్
సెల్: 94408 60625
సత్యవాణిశ్రీ
అడ్వకేట్ & నోటరీ
మాధవనగర్, పిఠాపురం